అన్నదాతకు అండగా సీఎం జగన్



కళ్యాణదుర్గంలో సమీపంలో ఎండిన పంటను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు (ఫైల్)

- పంట పరిహారానికి రూ.133.5 కోట్లతో ప్రతిపాదనలు
- కరువు బృందం పర్యటనతో రైతుకు మరింత ఊపిరి

రాయదుర్గం: వర్షభావ పరిస్థితుల కారణంగా దెబ్బ తిన్న పంటల లెక్క తేలింది. రాయదుర్గం, కళ్యాణ దుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో లక్ష హెక్టార్లలో ఖరీఫ్ పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. నష్ట నివారణ చర్యల్లో భాగంగా అధికారులు రూ.133.5 కోట్లతో ప్రణాళికలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ విషయంలో అడుగడుగునా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ రైతన్నలకు అండగా నిలిచారు. దెబ్బతిన్న ప్రతి ఎకరం జాబితాలో చేర్చేలా పటిష్ట చర్యలు చేపట్టారు. గడిచిన నాలుగేళ్లు దంచికొట్టిన వర్షాలు ఈ ఏడాది వాతావరణంలో చోటు చేసుకున్న అనేక మార్పుల కారణంగా ముఖం చాటేశాయి. ఈ కారణంగా రైతన్నలకు అనుకోని నష్టం సంభవించింది. దీంతో పంటల నమోదు ఆధారంగా నష్టాన్ని గుర్తించారు.

కేంద్ర బృందం పర్యటనతో ఊపిరి

వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటలను గత మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కరువు బృందం పరిశీలించింది. రైతు కష్టాలను స్వయానా తెలుసుకుని నివేదికలు సిద్ధం చేసింది. తప్పక ఆదుకునే చర్యలు చేపడతామని గట్టి హామీ ఇచ్చింది. దీంతో రైతన్నలకు మరింత ఊపిరి దక్కింది. సకాలంలో పంటనష్ట పరిహారం ఇచ్చి అన్నదాతలకు అండగా నిలవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాంత రైతన్నల జీవన విధానాలపై ప్రత్యేకంగా తయారు చేయించిన హార్డ్ కాపీని కరువు బృందం సభ్యులకు అందజేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని రైతులకు రూ.46 కోట్లు, కళ్యాణదుర్గానికి 47.40 కోట్లు, ఉరవకొం నియోజకవర్గ రైతులకు రూ.38.20 కోట్లు పరిహారం కోరుతూ ప్రతిపాదనలు పంపారు.

పంట నష్టం ప్రతిపాదన ఇలా..

నియోజకవర్గం	రైతులు	పంటనష్టం (హెక్టార్లలో)	పరిహారం (ప్రతిపాదన)
రాయదుర్గం	28,306	31,778	రూ.48 కోట్లు
కళ్యాణదుర్గం	27,594	30,858	రూ.47.40 కోట్లు
ఉరవకొండ	33,596	38,522	రూ.38.20 కోట్లు

ప్రతి రైతుకూ న్యాయం



వర్షం కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హత కలిగిన ప్రతి రైతుకూ న్యాయం చేకూర్చేలా వ్యవసాయాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటీవల కరువు బృందం సభ్యుల పర్యటన కూడా విజయవంతమైంది. పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాం.

– రాణిసుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రణయ్‌కు సత్కారం



పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డిని సత్కరిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తాజాగా ప్రకటించిన యువజన విభాగంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఆమిద్యాల గ్రామానికి చెందిన రాజేష్ గురువారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి, పార్టీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. రాజేష్ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

బొమ్మనహాళ్: కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీడీఓ షకీలా బేగంకు మండలంలోని ఫీల్డు అసిస్టెంట్లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు హులిగప్ప, ఉపాధ్యక్షులు మల్లికార్జున, ప్రదీప్, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా షేక్షావలి



కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో కళ్యాణదుర్గం షేక్షావలికి అవకాశం లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యుల పేర్లను కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఈ సందర్భంగా కళ్యాణదుర్గానికి చెందిన ఎస్‌కే షేక్షావలిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌కు రుణపడి ఉంటానన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్ల పంపిణీ



క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

బొమ్మనహాళ్: క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ షకీలాబేగం, ఎంపీపీ పద్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా కిట్లను సచివాలయాలకు పంపిణీ చేశారు. మండలంలోని 15 సచివాలయాలకు క్రికెట్ కిట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ మొదలైన ఆట వస్తువులను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం చేయండి



నిర్మాణం పూర్తయిన పశు వైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఆర్ డీఈ అరుణ్‌కుమార్

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలలని పీఆర్ డీఈ అరుణ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని బెళుగుప్ప, ఎర్రగుడి, శీర్పి గ్రామాల్లోని ఆర్‌బీకేలు, సచివాలయాల నిర్మాణాలను మండల పీఆర్ జేఈ సుధాకర్‌తో కలసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బెళుగుప్పలో నిర్మాణ పనులు పూర్తయిన పశు వైద్యకేంద్రాన్ని బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్పతో కలసి పరిశీలించారు. త్వరలోనే పశువైద్య కేంద్రాన్ని ప్రారంభిస్తామని డీఈ తెలిపారు.

ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శేఖర్



ఉరవకొండ: ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉరవకొండకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కోలేగుండ్ల శేఖర్ నియమితులయ్యారు. గురువారం ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు రాష్ట్ర చైర్మన్ పాలపర్తి శ్రీనివాస్ చక్రవర్తి నుంచి వెలువడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు చైర్మన్, కోర్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎరుకుల జాతి అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

పట్టణ కన్వీనర్‌కు మాతృవియోగం



పాడె మోస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డికి మాతృవియోగమైంది. కేశవరెడ్డి మాతృమూర్తి లక్ష్మీదేవి గురువారం వేకువజామున స్వగృహంలో కన్నుమూశారు. ప్రభుత్వ విప్ కాపు దంపతులు రామచంద్రారెడ్డి, భారతి, ఏపీఐసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ తదితరులు లక్ష్మీదేవి భౌతికాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాడె మోసి అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ విప్ కాపు ఉన్నారు. ఆదర్శభారతి రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ సోమన్న, వైస్ సర్పంచు నబీషా, మాజీ వైస్ సర్పంచు పెద్దదేవర మాబుపీరా, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, వై.చంద్రమోహన్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

నివాళి

బొమ్మనహాళ్: మండలంలోని శింగానహళ్లి సర్పంచ్ కృష్ణ, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్ అమ్మమ్మ రామక్క (90) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకుడు లోకేష్ పాల్గొన్నారు.

అక్రమార్కుల గుండెల్లో వణుకు



లేఅవుట్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

రాయదుర్గం: పట్టణంలోని బీటీపీ, గౌడ, మల్లాపురం లే అవుట్లలో ప్రభుత్వ స్థలాల కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత ఉత్తర్వుల మేరకు తహసీల్దార్ ఓబులేసు మూడు బృందాలను ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. గురువారం ప్రభుత్వ లేఅవుటల్లలో అధికారుల బృందం విడివిడిగా పర్యటించిరికార్డుల మేరకు ఉన్న పట్టాలు ఎన్ని..? బోగస్ పట్టాలు ఎన్ని? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టుకుంది. దివంగత నేత వైఎస్సార్ హయాంలో ఏర్పాటైన ఇందిరమ్మ కాలనీల్లో టీడీపీ నాయకులు కొందరు ఇష్టారాజ్యంగా కబ్జాకు పాల్పడ్డారు. ఒక్కో పట్టా రూ.30 వేల నుంచి రూ.40 వేలకు అమ్ముకున్నారనే అభియోగాలు సర్వాత్రా వ్యక్తమౌతున్నాయి. దీనికి తోడు బీటీపీ, గౌడ లేఅవుట్‌లో ఒక్కో వ్యక్తి 5 నుంచి 10 వరకు స్థలాలు ఆక్రమించుకుని బేసిమట్టాలు నిర్మించుకున్నారు. తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి దొంగ పట్టాలు సృష్టించారు. ఈ పరిణామాల పై ఇటీవల 'సాక్షి' లో డీ–పట్టాలు అమ్మేస్తున్నారు అనే కథనాన్ని ప్రచురితమవుడంతో అందుకు కలెక్టర్ సీరియస్‌గా పరిగణించారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి దొంగ పట్టాలు, అక్రమ బేసిమట్టం నిర్మాణాలు గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

మాటిచ్చారు.. నెరవేర్చారు!



ఎస్సీ కాలనీలో పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

విడపనకల్లు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరిస్తానని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మాటిచ్చి నెరవేర్చారని సచివాలయ కన్వీనర్ నాగరాజు, గృహసారథులు యువరాజు, శివశంకర్, పెద్ద ఉలిగన్న, కాలనీవాసులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో ఎస్సీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే చేపట్టగా పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీర్చేందుకు అధికారులు జలజీవన్ పథకం కింద నూతనంగా తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారని కన్వీనర్ నాగరాజు తెలిపారు. పైపులైన్ పనులు చేపట్టే లా చర్యలు తీసుకున్న మాజీ ఎమ్మెల్యేకు ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు సత్కారం



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పోలీసులు స్వప్న, సౌభాగ్య, రాము, ఎస్‌ఐ శివ

కుందుర్పి: విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన ఇద్దరు మహిళా పోలీసులు జిల్లా ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా గురువారం ప్రతిభా అవార్డులు అందుకున్నారు. మండలంలోని కుందుర్పి, నిజవల్లి సచివాలయ మహిళా పోలీసులు సౌభాగ్య, స్వప్న అవార్డుకు ఎంపికై నట్లు పోలీసులు తెలిపారు. అవార్డు అందుకున్న మహిళా పోలీసులను ప్రజా ప్రతినిధులు, పోలీసులు అభినందించారు.

కూడేరు: లోక్ అదాలత్‌లో మండలం నుంచి ఎక్కువ కేసులు, దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు పరిష్కార మార్గం లభించేలా కానిస్టేబుల్ రాము కృషి చేశారు. దీంతో గురువారం ఎస్పీ అన్బురాజన్ తన కార్యాలయంలో కానిస్టేబుల్ రాముని అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.

బొమ్మనహాళ్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరచిన ఎస్‌ఐ జి.శివను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. ఉత్తమ సేవలతో పాటు సెప్టెంబర్ 30న బళ్లారి పట్టణానికి చెందిన వినోజ్ హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసినందుకు అవార్డు ప్రదానం చేసి అభినందించారు. కాగా ఎస్‌ఐ శివ బెళుగుప్ప పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

సంక్షేమ పథకాలను వివరించండి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: సీంఎ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీచరణ్ సూచించారు. మండలంలోని మానిరేవు, తిమ్మసముద్రం, కొండాపురం, ముద్దినాయనపల్లి, ఈస్ట్ కోడిపల్లి పంచాయతీల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న చేసిన అభివృద్ధిని తెలియజేయడంతోపాటు గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాల కొనసాగింపు సాధ్యమన్నారు. ఈ సందర్భంగా తిమ్మసముద్రం నుంచి కారం మారెప్ప, మంగలకుంట నుంచి కంసల రామాంజనేయులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ బొమ్మన్న, వైస్ ఎంపీపీ, లక్ష్మీకాంతమ్మ, పార్టీ మండల కన్వీనర్ సర్వోత్తం, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ ధనుంజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శెట్టూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శెట్టూరు –2 బీసీ (జనరల్, మహిళ), లక్ష్మంపల్లి–1 ఎస్సీ (మహిళ), అయ్యగార్లపల్లి–1 బీసీ (జనరల్), చిన్నంపల్లి–1 ఎస్సీ(మహిళ) ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో అర్హులైన యువత ఈ నెల 20 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలి



ఈవీఎంను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య

రాయదుర్గం: ఈవీఎంలపై ప్రతి ఓటరూ అవగాహన పెంచుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి చర్యలు చేపడతామన్నారు. అనంతరం గుమ్మఘట్ట తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఫారం–7 (ఓటు తొలగింపు) దరఖాస్తులపై బీఎల్‌ఓలతో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఈడీటీ సుజాత, సీనియర్ సహాయకుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

వేరుశనగకు అగ్గితెగులు



తూముకుంట సమీపంలో తెగుళ్లు సోకిన వేరుశనగ

కుందుర్పి: మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగుచేసిన వేరుశనగ పంటకు అగ్గితెగులు, నల్లచీడ తదితర తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రబీలో మండల వ్యాప్తంగా 1,079 ఎకరాల్లో వేరుశనగ సాగైంది. పలు రకాల మందులు పిచికారీ చేసినా తెగుళ్లు నయం కావడం లేదని జంబుగుంపల, ఎర్రగుంట, బెస్తరపల్లి గ్రామాల రైతులు వాపోయారు. తెగుళ్ల నివారణ విషయమై కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప మాట్లాడుతూ.. ఎక్సాకొనజాల్, ట్రైఫీకానజెల్ లేదా వ్యారిడాం ఐసిస్ మందును పిచికారీ చేస్తే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు.

ఆర్‌బీకే తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరిలో రైతు భరోసా కేంద్రాన్ని ఏడీహెచ్ డాక్టర్ శ్రీనివాసు గుప్త గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విజ్ఞానబడి కార్యక్రమం నిర్వహించి పశువులు, గొర్రెలకు సంబంధించి యజమానులకు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. అనంతరం వీర్యం ద్వారా పెయ్య దూడల పథకం, దాణామృతం, గడ్డి కత్తిరించే యంత్రాలను సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

ఉరవకొండ: స్థానిక 10వ వార్డు బళ్లారి రోడ్డులో నివాసముంటున్న కొప్పపురం సత్యనారాయణ భార్య అన్నపూర్ణ ఈ నెల 7న అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం మృతురాలి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను సర్పంచ్ లలితమ్మ అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు నిరంజన్‌గౌడ్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వన్నూర్‌సాబ్, మైనార్టీ నాయకుడు అన్వర్, వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, వలంటీర్లు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని సిరిగెదొడ్డి, గొల్లపల్లి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్రను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన నిరుపేదలు లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



కుందుర్పి ఎస్‌ఐ వెంకటస్వామి / వజ్రకరూరు ఎస్‌ఐ నరేష్ / బెళుగుప్ప ఎస్‌ఐ శివ

కుందుర్పి: ఎస్‌ఐగా వెంకటస్వామి గురువారం బాధ్యతలు తీసుకొన్నారు. కుందుర్పి ఎస్‌ఐగా ఎరిస్వామి 15 రోజులు, సాయినాథ్ ప్రసాద్ నాలుగు రోజులు మాత్రమే పనిచేసి సెలవుపై వెళ్లడం తెలిసిందే. దీంతో ఉరవకొండలో పనిచేస్తున్న వెంకటస్వామిని కుందుర్పి ఎస్‌ఐగా ప్రభుత్వం నియమించింది.

వజ్రకరూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్‌ఐ జి.నరేష్ బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నుంచి ఆయన ఇక్కడికి బదిలీప వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు

బెళుగుప్ప: ఎస్‌ఐగా గురువారం జీ శివ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు బెళుగుప్ప ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామకృష్ణయ్య అనంతపురానికి బదిలీ కావడంతో బొమ్మనహాళ్ ఎస్‌ఐగా ఉన్న శివ బదిలీపై బెళుగుప్ప స్టేషన్‌కు వచ్చారు.

పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం

రాయదుర్గంటౌన్: విద్యార్థుల చదువులో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రిన్సిపాల్ వీరేష్ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున సెల్‌ఫోన్, టీవీకి దూరంగా పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరవకూరుకు తారు రోడ్డు



కూడేరు: మండలంలోని అరవకూరుకు రూ.75 లక్షలతో తారు రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి నుంచి అరవకూరుకు 1.5కిలోమీటర్ దూరం ఉంది. ఈ రోడ్డు గతంలో కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉండేది. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి చొరవతో ఉపాధి హామీ ద్వారా తారు రోడ్డు ఏర్పాటుకు రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 11న తారు రోడ్డు పనులు ప్రారంభించారు. బుధవారం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోడ్డు బాగు పడడంతో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ



శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి పాఠశాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఉరవకొండ: రెండు రోజుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి సిబ్బంది సమ్మె చేస్తుండటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ అమృతరాజ్ గురువారం ఈఓ గౌస్‌సాహెబ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, వైకేపీ అనిమోటర్ల సహకారంతో తెరిపించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు.

కుందుర్పి: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో చిన్నారులు అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారం అందజేయాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంఈఓ ఓబుళపతి సూచించారు. కుందుర్పి, మలయనూరు , బెస్తరపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు భోజన సౌకర్యం కల్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు ఐసీడీఎస్ సూపర్ వైజర్లు లక్ష్మీదేవి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: అంగన్‌వాడీ పిల్లలకు దగ్గరున్న పాఠశాలల్లో, గ్రామ సచివాలయాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందజేశారు. గురువారం కూడా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొన్నారు. పిల్లలకు పౌష్టికాహారం దూరం కాకూడదన్న ప్రభుత్వ ఆదేశాలతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, ఎంఈఓ శ్రీధర్ తిప్పనపల్లి, అడవిగొల్లపల్లి, చిన్నంపల్లి తదితర గ్రామాల్లో పిల్లలకు పాఠశాలలు, గ్రామ సచివాలయల ద్వారా పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, విడపనకల్లు, గడేకల్లు, వి.కొత్తకోట, పొలికి తదితర గ్రామాల్లో ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది కలసి గురువారం అంగన్‌వాడీ సెంటర్లును తెరపించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండటంతో ఎంపీడీఓ పర్యవేక్షణలో వెలుగు అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంగన్‌వాడీ సెంటర్లును నిర్వహించారు.

అంగన్‌వాడీల సెంటర్లు వెంటనే తెరవాలి

కళ్యాణదుర్గం రూరల్: మూసివేసిన అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే తెరవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. గురువారం పట్టణంలోని సెంట్రల్ అంగన్‌వాడీ సెంటర్‌లో మెప్మా, సచివాలయ సిబ్బందితో సీడీపీఓ మాట్లాడారు. సచివాలయ సిబ్బంది మెప్మా, సంఘాల పర్యవేక్షణలో అంగన్‌వాడీల సెంటర్లను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీల సెంటర్లు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఉంటాయన్నారు.